క్లుప్తంగా

సేంద్రియ ఎరువుల వినియోగం మంచిది


మాట్లాడుతున్న శివన్నారాయణ

నెల్లూరు(సెంట్రల్): సేంద్రియ ఎరువులను వినియోగించడం ఎంతో మేలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ పేర్కొన్నారు. బీవీనగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. రైతులకు పలు సూచనలు చేశారు. భూమిని సారవంతం చేయడంలో సేంద్రియ ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన కలిగి ఉండాలి


నట్టల నివారణ మందుల పంపిణీ

వెంకటాచలం: పశుపోషణపై రైతులు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని కనుపూరు పశువైద్యాధికారిణి పి.శ్రీలక్ష్మి సూచించారు. మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పాలిచెర్లపాడు గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదకు రాని గేదెలకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేశారు. అలాగే సాధారణ వ్యాధులకు గురైన గేదేలకు చికిత్స చేసి, దూడలకు నట్టల నివారణకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు గేదెలు, ఆవుల్లో జలగ వ్యాధి అధికంగా ప్రబలుతుందని తెలియజేశారు. పాడి రైతులు గేదెలకు ప్రబలే వ్యాధులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన వైద్యులు శ్రీనివాసులునాయుడు, పశువైద్య సహాయకులు రామరాజు, గోపాలమిత్ర గడ్డం రాము, శ్రావణ్‌కుమార్, రమణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పొదలకూరు: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ స్రవంతిలు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సాధారణ ప్రసవం, ఆరోగ్య ఆసరా ప్రయోజనాలను వివరించారు. ఉచితంగా యూఎస్‌జీ, టిఫా స్కాన్ చేశారు. హైరిస్క్ గర్భిణులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రసవ సమయంలో మూడు, నాలుగు రోజుల ముందు రవాణా చేసేందుకు వాహన సదుపాయం గురించి వివరించారు.

- **కొడవలూరు:** గర్భిణుల్లో రక్తహీనత నివారణపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత ఆదేశించారు. కొడవలూరు పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. 34 మంది గర్భిణులను పరీక్షించగా, నలుగురిలో రక్త శాతం తక్కువగా ఉందని గుర్తించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పోషక విలువలపై గర్భిణులకు అవగాహన కల్పించి.. రక్తహీనతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 14న నిర్వహించనున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రామకృష్ణ, బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్ పాల్గొన్నారు.
- మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీలో పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత పరిశీలించారు. వైద్యాధికారి కావ్య, హెచ్‌ఈఓ కోటేష్, హెచ్‌ఎస్ రజియా, ఎమ్మెల్‌హెచ్‌పీ సౌమ్య, ఎస్సెన్ స్వర్ణలత, ఏఎన్‌ఎంలు సుష్మ, సరిత పాల్గొన్నారు.

ఓటును తప్పక నమోదు చేసుకోండి


సూచనలిస్తున్న నిర్మలానందబాబా

కోవూరు: ఓటును ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. కోవూరులోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓటరు ప్రత్యేక నమోదు దినాన్ని ఆదివారం నిర్వహించనున్నామని చెప్పారు. బీఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో తప్పక ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్‌ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పోస్టల్ సేవలు

- ప్రజలు, ఖాతాదారుల అవస్థ
- ఐదు రోజులుగా ఇదే తీరు


వెంకటేశ్వరపురంలోని పోస్టాఫీస్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లకు సంబంధించి వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ పోస్టాఫీస్‌లో సేవలు ఐదు రోజులుగా నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతో సర్వర్ పనిచేయపోవడంతో కార్యకలాపాలు స్తంభించాయి. దీంతో ఖాతాదారులు, ప్రజలకు పోస్టల్ సేవలు అందడంలేదు. వాస్తవానికి ప్రతి నెలా తమ ఖాతాల్లో నగదును జమ చేసేందుకు ఎంతో మందికి ఇక్కడికి వస్తుంటారు. అయితే రోజుల తరబడి సేవలు మొరాయిస్తుండటంతో వీరి ఇక్కట్లు వర్ణనాతీతమవుతున్నాయి. ఇక్కడ నెలకొన్న సమస్యను జిల్లా అధికారులకు తెలియజేసినా, వారు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టాఫీస్‌లో ఇలాంటి సమస్యలు నిత్యకృత్యంగా ఉన్నా, శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా పోస్టల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇలా అయితే ఎలా..?



వెంకటేశ్వరపురంలోని పోస్టాఫీస్‌లో కంప్యూటర్లు పనిచేయడం లేదని చెప్తున్నారు. డబ్బులు దాచుకోవాలన్నా.. తీసుకోవాలన్నా, రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. దగ్గరగా ఉంటుందని.. పనులు త్వరగా జరుగుతాయనే ఉద్దేశంతో బ్యాంకుల్లో కాకుండా పోస్టాఫీస్‌లో నగదును దాచుకుంటున్నాం. అయితే సాంకేతిక సమస్యతో ఇబ్బందిగా ఉంటోంది.

– పద్మమ్మ, వెంకటేశ్వరపురం

సమస్యను పరిష్కరించాలి



వెంకటేశ్వరపురంలోని పోస్టాఫీస్‌లో ప్రతి నెలా ఏదో ఒక సాంకేతిక సమస్య వస్తోంది. ఈ నెల్లో ఐదు రోజులుగా పనిచేయడంలేదు. పోస్టల్ ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను త్వరితగతిన పరిష్కరించి మా ఇబ్బందులను తొలగించాలి.

– మల్లికార్జునరావు, జనార్దన్‌రెడ్డికాలనీ

కడప దర్గా గంధమహోత్సవానికి ఆహ్వానం



నెల్లూరు(బారకాసు): కడపలోని అమీన్‌పీర్ దర్గా గంధమహోత్సవానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని దర్గా మతపెద్దలు శనివారం ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్పొరేటర్లు కరిముల్లా, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులను తొలగించాల్సిందే


ముస్లిం మహిళల నిరసన

నెల్లూరు(బృందావనం): వాకర్స్ రోడ్డులోని పరమేశ్వరినగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలంటూ ఆందోళనను భారత రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దుకాణం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. నాలుగు రోజుల నుంచి నిరసన తెలియజేస్తున్నా, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జేఏసీ జిల్లా శాఖ నిర్వాహకులు ఆయేషా ఖాతున్, సఫియా అక్తర్, హబీబా, అమీరా, సాబీరా, యాస్మిన్, ఆసియా, అమ్రిన్, సనా, సబా తదితరులు పాల్గొన్నారు.

- ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని మసీదు ఎదురుగా రెండు మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతులివ్వడం దారుణమని ముస్లిం యూత్ సేవా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాలిద్ ఆరోపించారు. మద్యం దుకాణాల వద్ద నిరసన చేపట్టారు.

12న కృష్ణమాదిగ పర్యటన


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 12న పర్యటించనున్నారని సంస్థ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణమాదిగ, గొల్లపల్లి శ్రీనివాసులు, పందింటి అంబేడ్కర్ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో అమలయ్యేంత వరకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారీగా తరలివచ్చి ఆయనకు స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. నేతలు మంద పెంచలయ్య, పాపయ్య, వెంకటేశ్వర్లు, అంకబాబు, సుజాత, వరప్రసాద్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన

దేదీప్యం.. కార్తీక దీపోత్సవం

నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం నిర్వహించిన కార్యక్రమాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. దీపాలను భక్తిప్రపత్తులతో వెలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నిప్పో ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గాయత్రినగర్, రిత్విక్ ఎన్‌క్లేవ్, సావిత్రినగర్, చంద్రమౌళీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- శాంతినగర్, బట్వాడిపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

ఏపీపీఆర్డీఈఏ సర్వసభ్య సమావేశం


నూతన కార్యవర్గం

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం (ఏపీపీఆర్డీఈఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఖాదర్‌మస్తాన్, శ్రీవాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఓ హోటల్లో ఏపీపీఆర్డీఈఏ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మల్లికార్జునరావు, కోశాధికారిగా రఫీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేత రవీంద్ర మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఏఈ, జేటీఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మున్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు పరమేశ్వరలింగం, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులో అధునాతన న్యూరో వైద్యం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): పక్షవాతం, బ్రెయిన్‌స్ట్రోక్, నరాల బలహీనత, ఫిట్స్ తదితర వ్యాధులకు అధునాతన న్యూరో వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో సినాప్స్ న్యూరో క్లినిక్స్ రాష్ట్రస్థాయి సదస్సును నెల్లూరు న్యూరో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధునిక వైద్య సేవలపై వైద్యులతో పాటు ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. నారాయణ వైద్య సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బిజూ రవీంద్రన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, న్యూరాలజిస్టులు రమణమూర్తి, బీ శ్రీనివాసులురెడ్డి, పీ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(సెంట్రల్): నుడా చైర్మన్ పదవి లభించిన సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు.

అబుల్ కలామ్ ఆజాద్ జయంతి రేపు

నెల్లూరు(దర్గామిట్ట): భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించనున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, అదనపు జిల్లా వక్ఫ్ అధికారి ఖుదావన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం మతపెద్దలు హాజరుకావాలని కోరారు.

ఏసీ స్టేడియంలో మెడికల్ క్యాంప్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మెడికల్ క్యాంపును స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దాదాపు 300 మందికి వైద్య పరీక్షలను డాక్టర్లు శ్రీనివాసకుమార్, శ్రీధర్, సత్యనాథ్ జరిపారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, సెక్రటరీ గుర్రం వెంకటసురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు నెల్లూరీయులు


క్రీడాకారులను అభినందిస్తున్న ద్వారకానాథ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర అండర్ – 13 పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో నెల్లూరు నుంచి లతారెడ్డి విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్రం తరపున ఈమె ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్ – 17 స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించిన సుస్మితారెడ్డి, రేవంత్‌రెడ్డి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజయవాడలో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని స్టోన్‌హౌస్‌పేటలోని తన కార్యాలయంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ శనివారం అభినందించారు. కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా వనజ సేవలు ఎనలేనివి



నెల్లూరు (టౌన్): బాలికల విద్యాభివృద్ధికి వనజ అందించిన సేవలు ఎనలేనివని నెల్లూరు అర్బన్, రూరల్ ఎంఈఓలు తిరుపాల్, మురళీధర్ పేర్కొన్నారు. నగరంలోని కస్తూరిదేవి బాలిక విద్యాలయ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వనజ దంపతులను పాఠశాల యాజమాన్య ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఏఓ నరేష్, డైట్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ ఇవ్వాలంటూ నిరసన



నెల్లూరు (టౌన్): తల్లికి వందనం పేరిట ఏటా రూ.15 వేలను ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తల్లిదండ్రులను మోసం చేసిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ ఆరోపించారు. తల్లికి వందనం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో శనివారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నేతలు సుమన్, నవీన్, సుకుమార్, వినోద్, మౌనీష్, హేమంత్, లోకేష్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి


ప్రారంభిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): చేనేత, హస్తకళా ఉత్పత్తులను ప్రజలు ఆదరించి ప్రోత్సహించాలని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో చేనేత హస్తకళ, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను భావనారుషి చేనేత, హస్తకళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రదర్శనను సమితి నిర్వాహకుడు సురేష్ ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అనంతరం సురేష్ మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ చీరలు, డిజైన్ టాప్స్, డోర్ కర్టన్స్ తదితరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు.

ఉత్సాహంగా రిట్రీట్



నెల్లూరు(బృందావనం): బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్ వార్షిక ఒక దిన స్త్రీల రిట్రీట్‌ను ఉత్సాహంగా శనివారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని చర్చిలో స్త్రీల సమాజ కార్యదర్శి అనితారాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేకారాధనలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ భాగ్యలత జోసఫ్, రెవరెండ్ హుల్దా శ్యామ్‌సన్ వాక్యోపదేశం చేశారు. బైబిల్ క్విజ్, స్కిట్స్, పాటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆలపించిన ప్రత్యేక గీతాలు అలరించాయి. సంఘకాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్, స్త్రీల సమాజ పెద్దలు నిర్మల సుధాకర్, డాక్టర్ రాజకుమారి, నిర్మల మణిరావ్, జ్యోతి జయకుమార్, క్వైర్ డైరెక్టర్ బిల్లీ శ్యామ్‌సన్, స్త్రీల సమాజ అధ్యక్షురాలు ప్రభావతిపాల్, కోశాధికారి రోస్‌రాణి, ఆషా, నీరజ, షీలా తదితరులు పాల్గొన్నారు.

న్యూ క్రాఫ్ట్ ఇండియా
క్రాఫ్ట్ బజార్
చేనేత వస్త్ర,హస్తకళా ప్రదర్శన మరియు అమ్మకం
సమయం: ఉదయం 11గం॥ నుండి రాత్రి 9.30 వరకు
తయారీదారులచే నేరుగా అమ్మకం
ప్రవేశం ఉచితం
ఓపెన్ గ్రౌండ్, కస్తూరిదేవి గార్డెన్స్ ఎదురుగా,
క.వి.ఆర్ పెట్రోల్ బంక్ దగ్గర, నెల్లూరు